


కలెక్టర్‌పై ఎస్పీ మహేశ్ బి గితేకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కలెక్టర్‌పై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

రాజన్న సిరిసిల్ల, మే 24 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: ప్రొటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు మాట్ల మధు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేశ్ బి గితేను మర్యాద పూర్వకంగా కలిసి కలెక్టర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్ల మధు మాట్లాడుతూ, ఇటీవల సిరిసిల్ల నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావును ఆహ్వానించలేదని తెలిపారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఓడిపోయిన కేకే మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ పరమైన ఎలాంటి అధికారాలు లేకున్నప్పటికీ.. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా అధికారికంగా పాల్గొని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వివాదాలు తలెత్తి గొడవలకు దారి తీస్తున్నాయని తెలిపారు. ఇందుకు ముఖ్య కారకుడు సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అని స్పష్టం చేశారు. సదరు విషయాలపై పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికార కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం చేయాలన్నారు. ప్రొటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా, వివాదాస్పదంగా కార్యక్రమాలు నిర్వహించిన కలెక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, నాయకులు సిలువేరి చిరంజీవి, గుండు ప్రేమ్‌కుమార్, బండి జగన్, అమర్‌రావు, నందగిరి భాస్కర్ పాల్గొన్నారు.

### ఏడాదిగా ఉప్పు.. నిప్పులానే..

బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో జగిత్యాలలో పొలిటికల్ హీట్ మొదలైంది. అప్పుడే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఆయన అనుచరులు తీవ్ర నిరసన ప్రకటించి, రాజీనామాకు సిద్ధపడగా అధిష్ఠానం బుజ్జగించడంతో అసంతృప్తితోనే కొనసాగుతూ వచ్చారు. తర్వాత జీవన్‌రెడ్డి అనుచరుడు దారుణ హత్యకు గురికావడం, తన అనుచరుడిది రాజకీయ హత్య అని ఆయన ఆరోపించడం సంచలనం సృష్టించింది. ఈ ఏడాది మార్చి 28న జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి గడువు ముగిసిన తెల్లవారే ఎమ్మెల్యే చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యపర్చింది. మోతె రోడ్డులో ఏడాది క్రితం వరకు బీఆర్ఎస్ కార్యాలయంగా నిర్వహించిన తన సొంత ఇంటిని జగిత్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా పేర్కొంటూ, అక్కడే చెక్కులు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో జీవన్‌రెడ్డితోపాటు ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# జీవన్‌రెడ్డి X సంజయ్

### ఎమ్మెల్యే, మాజీ మంత్రి మధ్య తారాస్థాయికి అంతర్గత పోరు

- ఒకరు ఎడ్డెం అంటే మరొకరు తెడ్డెం
- రోజురోజుకూ ముదురుతున్న పంచాయితీ
- వర్గపోరుతో నియోజకవర్గంలో పడకేసిన పాలన
- జగిత్యాలలో అభివృద్ధి ఖల్లాస్
- ఇంత వరకు అతీగతి లేని ఇందిరమ్మ కమిటీలు
- ఊసేలేని నామినేటెడ్ పోస్టుల భర్తీ
- ఇద్దరి మధ్య నలిగిపోతున్న అధికారులు
- బదిలీ చేయించుకోవడం నయమంటున్న వైనం

జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తారాస్థాయికి చేరుకుంది. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి భగ్గుమంటోంది. ఒకరు ఎడ్డెం అంటే మరొకరు తెడ్డెం అంటుండడంతో రోజురోజుకూ ఇరువురి మధ్య పంచాయితీ ముదురుతోంది. ఈ వర్గపోరుతో నియోజకవర్గంలో పాలన పడకేసింది. ఫలితంగా అభివృద్ధి ఖల్లాస్ అయింది. ఇందిరమ్మ కమిటీలు ఇంతవరకు అతీగతి లేకపోగా, నామినేటెడ్ పోస్టుల భర్తీ ఊసే లేకుండా పోయింది. మరోవైపు వీరువురి మధ్య నియోజకవర్గ అధికారులు నలిగిపోతుండగా, బదిలీ చేయించుకోవడమే నయమంటున్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది.

జగిత్యాల, మే 24 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్, ఏడాది క్రితం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం, తర్వాత నియోజకవర్గంలో రాజకీయాలు మారిపోవడంతో మాజీమంత్రి జీవన్‌రెడ్డి, ఆయన వర్గీయులు తీవ్ర ఆవేదనకు లోనవుతూ వస్తున్న విషయం తెలిసిందే. గత నెల 28న జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి గడువు పూర్తవడం, పార్టీ మరోసారి అవకాశం కల్పించకపోవడంతో కాంగ్రెస్‌తో పాటు నియోజకవర్గంలోనూ ఆయనకు గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మొన్నటి వరకు ప్రొటోకాల్ విషయంలో పెద్దగా సమస్యలు రాకపోయినా, ఎమ్మెల్సీ పదవి ముగియడంతో తలెత్తుతున్నాయి. దీనికి తోడు పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే తన వైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తుండడం, అధికారులు సైతం ఆయన మాటకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా కనిపిస్తుండడం మాజీమంత్రి, ఆయన అనుచరవర్గం జీర్ణించుకోలేకపోతున్నది. పదేండ్లుగా అధికారంలో ఉండి, తమను ఇబ్బందులకు గురిచేసి, ఇప్పుడు పార్టీ మారి మళ్లీ తమపై పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నాలు చేస్తుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిన ఈ ఏడాది కాలంలో పలుమార్లు జీవన్‌రెడ్డి, ఆయన వర్గీయులు అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వచ్చినా, ఇప్పుడు ఇరువురి మధ్య పొలిటికల్ హీట్ తారాస్థాయికి చేరింది. ఏకంగా రాష్ట్ర మంత్రినే జీవన్‌రెడ్డి ''మీ రాజ్యం మీరు ఏలుకోండి'' అంటూ బాహాటంగా వ్యాఖ్యానించడం, ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో నాకు తెలియదు, స్పీకర్‌ను అడగండి అంటూ వ్యాఖ్యానించడం.. తర్వాత ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి అత్యధిక సార్లు ఓడిపోయింది జీవన్‌రెడ్డినే'' అంటూ దెప్పిపొడవడంతో జగిత్యాలలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి.

### విమర్శల జోరు పెంచిన జీవన్‌రెడ్డి

ఎమ్మెల్సీ పదవి ముగిసిన తర్వాత నుంచి జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేపై విమర్శల జోరు పెంచారు. అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలోనూ కాంగ్రెస్‌లో తప్పుడు పద్ధతిలో చేరారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. సారంగాపూర్ మండలంలోని రేచపల్లిలో ''కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యం చేసి, గోస పోసుకున్న వాళ్లు, ఇప్పుడు అధికారం రాగానే మళ్లీ కాంగ్రెస్ ముసుగు వేసుకొని మళ్లీ దౌర్జన్యాలు చేయడానికి వస్తున్నారు'' అంటూ వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశమైంది. తర్వాత సైతం అదే పద్ధతిలో వ్యవహరించారు. ''బతుకచ్చినోడు బతుకచ్చినట్లే ఉండాలి.. ఇల్లును ఆక్రమించుకుంటానంటే ఊర్కోం'' అంటూ పరోక్ష వ్యాఖ్యలు సైతం చర్చనీయాంశంగా మారాయి.

బూర్జువా కుటుంబానికి చెందిన వారని, భూస్వామ్య విధానాలు అంటూ సైతం విమర్శిసూ వస్తున్నారు. దీనికి తోడు పదేండ్ల పాటు అభివృద్ధి చేయడం చేతకాక ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వచ్చాడంటూ విమర్శిస్తున్నారు. తాజాగా, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జగిత్యాలకు వచ్చిన సమయంలోనూ జీవన్‌రెడ్డి ఒక రకంగా తన ఆగ్రహాన్ని, నిరసనను ప్రత్యక్షంగానే తెలియజేయడం చర్చనీయాంశంగా మారింది. మంత్రి ఆలింగనం చేసుకోవడానికి వస్తే నిరాకరించడంతో పాటు, ''మీ రాజ్యం మీరు ఏలుకోండి.. మా పని, పార్టీ పని అయిపోయింది..'' అంటూ మీడియా సాక్షిగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఏ పార్టీలో ఉన్నాడో తనకు తెలియదని, స్పీకర్‌ను అడిగితే చెబుతారంటూ మాట్లాడడం కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితిని కలిగించింది. ఈ విషయమై డాక్టర్ సంజయ్ జగిత్యాలలో స్పందించడంతో, మరోసారి జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేపై విమర్శల వర్షం కురిపించారు.

### జీవన్‌రెడ్డిపై విరుచుకుపడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సంజయ్ సైతం ప్రతి విమర్శలతో జీవన్‌రెడ్డిపై విరుచుకుపడుతున్నారు. టీడీపీకి ఎవరు వెన్నుపోటు పొడిచిండ్రో తెలుసంటూ ఆయన విమర్శిస్తున్నారు. తమది మొదటి నుంచి కాంగ్రెస్ కుటుంబమని, ఏనాడూ తనను కాంగ్రెస్‌లోకి జీవన్‌రెడ్డి ఆహ్వానించలేదంటూ కౌంటర్లు ఇస్తున్నారు. జగిత్యాల అంటే జీవన్, జీవన్ అంటే జగిత్యాల అని అబద్ధపు ప్రచారం చేయించుకుంటున్నారని, జీవన్‌రెడ్డి అసలు జగిత్యాలను ఏం అభివృద్ధి చేశారంటూ విమర్శిస్తున్నారు. తమ కుటుంబ సభ్యులు ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందని, జీవన్‌రెడ్డి ఏమీ చేయలేదంటూ వ్యాఖ్యానిస్తున్నారు. అత్యధిక సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డి చెప్పుకొంటున్నారని, వాస్తవానికి ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా ఓడిపోయిన చరిత్ర సైతం జీవన్‌రెడ్డిదేనని దెప్పిపొడుస్తున్నారు. సీఎం ఆహ్వానిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నానని, పార్టీలో చేరలేదని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు.

### జాడ లేని మార్కెట్ కమిటీలు

జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రెండు మార్కెట్ కమిటీలు ఉండగా వీటికి పాలకవర్గాలను ఇంత వరకు నియమించలేదు. ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయాలన్నీ తారుమారైపోయాయి. ఎమ్మెల్సీగా కొనసాగిన సమయంలో జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతోపాటు, పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ప్రతిపాదించారు. అలాగే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తోపాటు డైరెక్టర్ల పేర్లను ప్రతిపాదించారు. అయితే, ఎమ్మెల్యే కూడా మరో జాబితాను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇద్దరి మధ్య నెలకొన్న పోరు నేపథ్యంలో మార్కెట్ కమిటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ పోస్టుల భర్తీ నిలిచిపోయింది. జగిత్యాలలో నెలకొన్న ఈ వర్గపోరుతో అభివృద్ధి ఆగిపోవడంతో పాటు, అధికారులు, ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### అభివృద్ధిపై తీవ్ర ప్రభావం

ఎమ్మెల్యే, మాజీ మంత్రి మధ్య నెలకొన్న వర్గపోరు నియోజకవర్గ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇరువర్గాల మధ్య ఇరుక్కొన్న అధికారులు.. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టలేని దుస్థితికి చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక రకమైన పరిస్థితి నెలకొంటే జగిత్యాలలో మరో రకంగా ఉంది. ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్గీయుల మధ్య సభ్యుల ఎంపిక విషయంలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. దీంతో ఇప్పటి వరకు ఇందిరమ్మ కమిటీలకు ఆమోద ముద్ర పడలేదు. అలాగే, అధికారుల నియామకంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో జరిగిన కొన్ని బదిలీలు, పోస్టింగులు అందరినీ విస్మయానికి గురి చేశాయి. జిల్లాకు కొన్ని నెలల క్రితం వచ్చి, మూడు నాలుగు నెలలు సైతం పనిచేయకముందే ఒక ఉన్నతాధికారి బదిలీకి గురయ్యాడు. గతంలో ఇదే జిల్లాలో పనిచేసి మరో జిల్లాకు బదిలీపై వెళ్లిన ఉద్యోగి ఐదారు నెలల వ్యవధిలోనే బదిలీపై తిరిగి వచ్చారు. ఇది అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అవినీతి ఆరోపణలు, ముఖ్యంగా బియ్యం లెవీ విషయంలో ఉన్న సదరు అధికారి తిరిగి రావడం అందరికీ సందేహాన్ని కలిగించింది. బదిలీ ఉత్తర్వులు తీసుకొని సదరు అధికారి విధుల్లో చేరేందుకు కార్యాలయానికి రాగా, జిల్లాకు చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి సదరు అధికారిని విధుల్లోకి తీసుకోవద్దని అడ్డు చెప్పడం, మరో ప్రజాప్రతినిధి సపోర్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి తన మాట వినడం లేదని, నజరానాలు సమర్పించడం లేదన్న మిషతో కీలక విభాగంలో పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారిని బదిలీ చేయించి మరో అధికారిని తెచ్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే, జిల్లాలో రాజకీయ సంచలనాలకు కేంద్రమవుతున్న ప్రజాప్రతినిధి తన పరిధిలో అన్ని కీలక శాఖలకు తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే ఉండాలన్న లక్ష్యంతో తన వారినే భర్తీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా, జిల్లా కేంద్రానికి చెందిన ఒక డివిజన్ స్థాయి అధికారిని ప్రజాప్రతినిధి బదిలీ చేయించడం, దాన్ని మరో వర్గం అడ్డుకొని నిలిపివేయించడం సంచనలం సృష్టించింది. ఈ నేపథ్యంలోనే ''జగిత్యాలలో పనిచేసే పరిస్థితులు లేవు.. ప్రభుత్వ పథకాలు అమలు చేసే పరిస్థితి కూడా లేదు.. ఇద్దరి మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు మా ప్రాణాలు తీస్తోంది.. ఏ నిర్ణయం తీసుకున్నా మరొకరి వద్ద నుంచి అబ్జెక్షన్ వస్తోంది.. ఏం చేయాలో అర్థం కావడం లేదు.. ఇక్కడ పనిచేసే కంటే వేరే వద్దకు బదిలీ చేయించుకోవడం నయం'' అంటూ అధికారులు వాపోతున్నారు.



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు, పక్కన మాజీ ఎమ్మెల్యే రసమయి

## ఎమ్మెల్సీ కవిత ఇష్యూ.. చిన్న మ్యాటర్

- పార్టీ అంతర్గత విషయాలు మీకెందుకు?
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

తిమ్మాపూర్, మే 24 : ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ ఇష్యూ చిన్న అంశమని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అంతర్గత అంశాన్ని ఇతర పార్టీలు అద్దంలో పెట్టి చూస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కేసీఆర్ ఇష్యూ ఉంటే చాలు మైకులందుకుంటారని, కేసీఆర్ గురించి మాట్లాడితే తాము ఫ్రంట్ పేజీల్లో కనిపిస్తామన్న ఆలోచనతో అలా చేస్తారని ఎద్దేవా చేశారు. లేఖ అంశంపై రాజకీయాలు చేయడం ఆపాలని హితవుపలికారు. ఎమ్మెల్సీ కవిత గతంలో సైతం ఎన్నోసార్లు అధినేత కేసీఆర్‌కు సూచనలు చేశారని, బీఆర్ఎస్‌లో ఆ స్వేచ్ఛ అందరికీ ఉందన్నారు. గతంలో ఆమె చేసిన సూచనలను పాటించి సక్సెస్ అయ్యామన్నారు. ఈ విషయంపై మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్.. కాంగ్రెస్‌లో మహిళలకు పదవులు ఇవ్వడం లేదని సాక్షాత్తూ మహిళా అధ్యక్షురాలు పీసీసీ అధ్యక్షుడి చాంబర్ ఎదుట ధర్నా చేశారని, అప్పుడెందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపించినా బండి సంజయ్ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. చిన్న చిన్న అంశాలపై కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిసారించాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రావుల రమేశ్, ఉల్లెంగుల ఏకానందం, పాశం అశోక్‌రెడ్డి, తిరుపతి, సుదగోని సదయ్య పాల్గొన్నారు.

గంగాధర: కోట్లనర్సింహుపల్లిలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని వేరు చేస్తున్న మహిళా రైతు బైరి లక్ష్మి



# కేంద్రాల్లోనే ధాన్యం.. రైతన్న దైన్యం

- అకాల వర్షాలతో తడిసి మొలకొస్తున్న వడ్లు
- ఆందోళనలో అన్నదాతలు
- ఇంకెప్పుడు కొంటారని సర్కారుపై ఆగ్రహం

గంగాధర/వేములవాడ రూరల్/రుద్రంగి/ బోయినపల్లి రూరల్, మే 24: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం పడిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కేంద్రాల్లో వడ్లు పోసి నెలదాటినా ఇంకెప్పుడు వడ్లు కొంటారని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలతో వడ్లు తడిసి మొలకొస్తున్నా.. ఇంకెప్పుడు కొంటారని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం, సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రూరల్, గంభీరావుపేట, రుద్రంగి, బోయినపల్లి మండలాల్లో వర్షం పడగా, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. వడ్లు కొనాలని గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో రైతులు ధర్నా చేశారు. అదే విధంగా బోయినపల్లి మండలం మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అకాల వర్షాలతో వడ్లు తడిసినా సర్కారుకు పట్టింపు లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే తేమశాతంతో సంబంధం లేకుండా తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



పెద్దపల్లి: వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



వేములవాడ రూరల్: నమిలిగుండుపల్లిలో మొలకెత్తిన ధాన్యంతో రైతులు


### తడిసిన వడ్లు కొనాలె

మాకున్న రెండెకరాల్లో వరి సాగుచేసిన. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని నెల క్రితం మా ఊళ్లే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పోసిన. చెడగొట్టు వానలు పడుతుంటే వడ్లు నానకుండా పర్దాలు కప్పుకొంట ఆరిగోసపడ్డ. వడ్లు జోకుడ్రి అని అడిగితే.. లైను ఇగ అత్తది అగ అత్తది అని చెప్పుకొంట జోకుత లేరు. నాలుగు రోజుల సంది వానలు మస్తుపడుతున్నయి. పర్దాలు కప్పినా లాభం లేకుండాపోయింది. వడ్లు మొలకచ్చినయి. మొలకెత్తిన వడ్లను కొని సార్లు మాకు న్యాయం చేయ్యాలె.



**- తైదల రవి, రైతు, కోట్లనర్సింహులపల్లి (గంగాధర)**

మొలకెత్తిన ధాన్యాన్ని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్



## ధాన్యం కొనుగోళ్లలో విఫలం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి రూరల్, మే 24 : ధాన్యం సేకరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. మండలంలోని మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయినా ప్రభుత్వానికి పట్టింపు లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై జీలుగ, జనుము, పెసర వంటి విత్తనాలు అందజేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రెండింతలు దోచుకుంటుందని మండిపడ్డారు. ప్రభుత్వానికి అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ, ఆరుగాలం పండించిన రైతుపై లేదని ధ్వజమెత్తారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ ఎంపీటీసీ ఐరెడ్డి గీత మల్లారెడ్డి, భీమనాథుని రమేశ్, జంగిడి సంజీవ్, కమల్‌గౌడ్, కట్ట గోవర్ధన్‌గౌడ్, ఎల్లారెడ్డి, కమల్, జీవన్‌రెడ్డి ఉన్నారు.

### సారూ.. మా వడ్లు కొంటలేరు

''ఓ వైపు వానలు దంచి కొడుతున్నా మా వడ్లు కొంటలేరు సారూ..'' అంటూ మల్లాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద మహిళా రైతు శివవ్వ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో చెప్పుకొంటూ బోరున విలపించింది. ''మా పెద్దాయన లేరు.. నా వడ్లు కొంటలేరు సారు'' అంటూ చెప్పుకోగా, అధైర్య పడొద్దని, అండగా ఉంటానని సుంకె రవిశంకర్ భరోసా ఇచ్చారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

## సర్కారు జాప్యంతో తీరని నష్టం

- మాజీ మంత్రి కొప్పుల ఆగ్రహం
- పలు గ్రామాల్లో తడిసిన ధాన్యం పరిశీలన

ధర్మపురి రూరల్, మే 24 : ధాన్యం కొనుగోళ్లలో నెలల తరబడి జాప్యం చేస్తుండడంతో రైతులను తీరని నష్టం వస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మపురి మండలం జైన, దొంతాపూర్, మగ్గిడిఎడపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించగా, రైతులు తడిసిన ధాన్యాన్ని ఆయనకు చూపిస్తూ తమను అనేకరకాలుగా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ ధాన్యం వేగంగా కొంటున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప ఎక్కడా సమర్థవంతంగా జరగడం లేదని విమర్శించారు. ఫలితంగా అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయన్నారు. మరో వైపు తూకం వేసిన బస్తాల నిల్వలు అలాగే ఉన్నాయనీ, లారీల కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. తూకం వేసినప్పుడే ఆరు కిలోలు కట్ చేస్తున్నారనీ, ఇప్పుడు ధాన్యం తడిసిన తర్వాత మిల్లర్లు మళ్లీ కట్ చేస్తారనీ, దీని వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కేసీఆర్ పాలనలో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేశామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సౌళ్ల భీమయ్య, అయ్యోరి రాజేశ్‌కుమార్, చీర్నేని నర్సయ్య, కుడిక్యాల మహేశ్, దుర్గం రవీందర్ తదితరులున్నారు.